మూడోసారి గద్దెనెక్కడం ఖాయం

- ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు
- తలసరి ఆదాయంలో దేశానికే ఆదర్శమంటూ వ్యాఖ్య
- సీఎం కేసీఆర్ నేతృత్వంలో సర్వతోముఖాభివృద్ధి దిశగా రాష్ట్రం


ఎమ్మెల్యేకు మద్దుతు తెలుపుతున్న ఏపీహెచ్‌బీ కాలనీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు


జగద్గిరిగుట్టలో జరిగిన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్


సుభాష్‌నగర్ డివిజన్ ఎమ్మెల్యే వివేకానంద్‌కు బ్రహ్మరథం పడుతున్న జనం

కుత్బుల్లాపూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముచ్చటగా మూడోసారి గద్దెనెక్కడం ఖాయమని ప్రభుత్వ విప్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బుధవారం జగద్గిరిగుట్ట డివిజన్ ఎంకేఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. 75 ఏళ్ల స్వాతంత్య్రంలో ప్రతిపక్ష పార్టీలు ప్రజా సంక్షేమాన్ని మరిచి వారి సంక్షేమం కోసమే పనిచేశాయన్నారు. కాని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. తలసరి ఆదాయంలో సైతం రాష్ట్రం దేశానికే తలమానికంగా మారిందని పేర్కొన్నారు. ఇది మింగుడు పడని ప్రతిపక్షాలు కేసీఆర్ పాలనపై విషం చిమ్ముతున్నాయని అన్నారు. ప్రజలను రెచ్చగొట్టి లబ్ధి పొందేందుకు చూస్తున్నారని.. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని... మరోసారి బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షుడు రుద్రా అశోక్, సీనియర్ నాయకులు సయ్యద్ రషీద్, మారయ్య, వేణు యాదవ్, బాబుగౌడ్, మహిళ నాయకురాలు ఇందిరాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ వివేకానంద్‌కు మద్దతుగా కాలనీల ఏకగ్రీవ తీర్మానాలు..

చింతల్ డివిజన్ శ్రీనివాస్‌నగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాలనీలో జరిగిన అభివృద్ధిని హర్షిస్తూ ఎమ్మెల్యే వివేకానంద్‌కు మద్దతుగా ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదం ఉన్నంత వరకు తన విజయానికి ఢోకా లేదన్నారు. రానున్న కాలంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు.

◆ వృద్ధుల సంక్షేమానికి పాటుపడుతున్న మహానేత సీఎం కేసీఆర్

రంగారెడ్డినగర్ డివిజన్ ఏపీహెచ్‌బీ కాలనీలో సీనియర్ సిటిజన్స్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో వృద్ధులకు రూ.2016 పెన్షన్ అందుతోందన్నారు. వారి అభ్యున్నతికి పాటుపడుతున్న మహానేత సీఎం కేసీఆర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ విజయ శేఖర్ గౌడ్, మాజీ వైస్ చైర్మన్ జయరామ్, బాపూజీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రవి, ఆదర్శనగర్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీనివాసులు, డివిజన్ ఉపాధ్యక్షుడు ఎండీ రఫీయుద్దీన్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కుత్బుల్లాపూర్ డి. రవి, కాలనీ సొసైటీ ఉపాధ్యక్షులు దుర్గ తదితరులు పాల్గొన్నారు.

◆ కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

సుభాష్‌నగర్ డివిజన్ సూరారం ఓం జెండా వద్ద బీఆర్‌ఎస్‌కేవీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు మాల్యాద్రి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే వివేకానంద్ హాజరై ప్రసంగించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేసి వారి సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్మికులకు కనీస వేతనాలు ఇచ్చేలా యాజమాన్యాలో చర్చించి అమలు పరిచిన ఘనత తమదేన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జి.సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పోలె శ్రీకాంత్, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో–ఆపరేటివ్ చైర్మన్ మన్నే రాజు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఎంఎస్ వాసు, పండరి, డాక్టర్ హుస్సేన్, యాదగిరి, యూసఫ్, భవన నిర్మాణ సంఘం సభ్యులు సీహెచ్ సురేష్, కొండయ్య పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు మద్దతుగా బీఆర్‌ఎస్‌లో చేరిన పలువురు


ఎమ్మెల్సీ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

బీఆర్‌ఎస్‌లో చేరిన రాష్ట్రీయ బసవదళ సభ్యులు

కుత్బుల్లాపూర్: జగద్గిరిగుట్టకు చెందిన రాష్ట్రీయ బసవదళ సభ్యులు, కుత్బుల్లాపూర్ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ దెంపె కృష్ణ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రుద్రా అశోక్, సీనియర్ నాయకులు రషీద్ భాయ్, ఎత్తరి మారయ్య, రాష్ట్రీయ బసవదళ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గులాబీ గూటికి కాంగ్రెస్ నేత బాల్‌రాజ్ యాదవ్

కుత్బుల్లాపూర్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బహదూర్‌పల్లికి చెందిన మేడ్చల్ జిల్లా మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆకినబోయిన బాల్‌రాజ్ యాదవ్ బుధవారం గండి మైసమ్మలోని జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ బంగారు తెలంగాణ కేసీఆర్‌తోనే సాధ్యపడుతుందని, ఈ విషయం గ్రహించిన పలువురు పార్టీలో చేరుతున్నారన్నారు.

నిరుద్యోగుల పక్షాన పోరాడేందుకే పోటీ చేస్తున్నా..

విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థి సాత్వికరెడ్డి



దుండిగల్: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల బరిలో మరో కొత్త పార్టీ నిలువనుంది. విద్యార్థుల రాజకీయ పార్టీ రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో పోటీ చేయనుంది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బౌరంపేట ప్రాంతానికి చెందిన సాత్విక రెడ్డిని ఎంపిక చేశారు. నియోజకవర్గానికి సుపరిచితురాలైన సాత్వికరెడ్డి గతంలో సమాచార హక్కు చట్టం రక్షక్ నుంచి రాష్ట్ర శిశు రక్షణ అధ్యక్షురాలిగా పని చేశారు. మహిళలు, యువతులు, మైనర్ బాలికలపై జరుగుతున్న దాడులపై పోరాడుతూనే సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆమె సేవలను గుర్తించిన విద్యార్థుల రాజకీయ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు సునీల్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించి బీ ఫాం అందజేశారు. ఈ సందర్భంగా సాత్వికరెడ్డి మాట్లాడుతూ... నియోజకవర్గంలో నిరుద్యోగులు వేల సంఖ్యలో ఉన్నారన్నారు. నిరుద్యోగులు, నిరుపేద ప్రజల పక్షాన పోరాడేందుకే తాను ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానని తెలిపారు. తనను ఆదరించాలని ప్రజలను కోరారు.

సొంతగూటికి కేఎం ప్రతాప్


టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కేఎం ప్రతాప్, ఆయన తనయుడు కేపీ విశాల్‌గౌడ్

కుత్బుల్లాపూర్: మాజీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ నేత కేఎం ప్రతాప్ సొంత గూటికి చేరుకున్నారు.. ఎనిమిది సంవత్సరాల క్రితం కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరిన ప్రతాప్ తదనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో గత కొంతకాలంగా పార్టీకి దూరంగా ఉంటూ వచ్చారు. బుధవారం కుత్బుల్లాపూర్‌లోని ఆయన నివాసానికి టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మాజీ ఎంపీ డాక్టర్ మల్లు రవి, ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి వచ్చి చర్చలు జరపగా ఆయన స్పందించి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన వెంట కుమారుడు విశాల్ గౌడ్, మైనారిటీ సెల్ నేత రషీద్, వైఎస్‌ఆర్‌టీపీ అసెంబ్లీ కన్వీనర్ రామగౌడ్ తదితరులు పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొలను హనుమంత్‌రెడ్డి విజయం కోసం కృషి చేస్తామని స్పష్టం చేశారు. కేఎం ప్రతాప్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి వివేకానందకు స్వయానా బాబాయ్ అవుతారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ లైన్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని కొంపల్లి సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ జీబీఆర్ ఫీడర్ పరిధిలోని పీఎస్‌ఆర్ కన్వెన్షన్ రోడ్డు, రిలయెన్స్ పెట్రోల్ బంక్, టొబాకో కంపెనీ రోడ్డు, జీబీఆర్ కల్చర్‌క్లబ్‌లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు..

◆ 11కేవీ జయభేరి ఫీడర్ పరిధిలోని జయభేరి పార్క్, శ్రీనివాస్ కాలనీ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు

◆ 11కేవీ గార్డెన్‌సొసైటీ ఫీడర్ పరిధిలోని గార్డెన్ సొసైటీ, ఉమామహేశ్వర కాలనీ, హైవిజన్ అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నిత్యావసరాల పంపిణీ

సుభాష్‌నగర్: టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి తన ఉదారతను చాటుకున్నారు. సుభాష్‌చంద్రబోస్‌నగర్‌కు చెందిన నిరుపేద అయిన వెంకటేష్ ఇటీవల అకాల మరణం చెందారు. ఆయన కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న పున్నారెడ్డి ఎస్పీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా తన అనుచరులతో బాధిత కుటుంబానికి తన వంతు సహాయంతో బుధవారం నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ ట్రస్ట్ మెంబర్ దండే రాజు, కాంగ్రెస్ నాయకులు ఆబేద్ తదితరులు ఉన్నారు.


బాధిత కుటుంబానికి నిత్యవసరాలను అందజేస్తున్న ఎస్పీఆర్ ట్రస్ట్ సభ్యులు

ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలి

రాజకీయ పార్టీలను కోరిన రిటర్నింగ్ అధికారి సైదులు

కుత్బుల్లాపూర్: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేందుకు రాజకీయ పక్షాలు సహకరించాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు అన్నారు. బుధవారం బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్, వామపక్ష పార్టీలతో సమావేశమైన సైదులు మాట్లాడుతూ.. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు అనుసరించాల్సిన ప్రవర్తనా నియమావళిని వివరించారు. అభ్యర్థులు తమ ఖర్చులను ఎప్పటికప్పుడు ఎన్నికల అధికారులకు తెలియజేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల ఖర్చుకు రూ.40 లక్షల పరిమితి ఉన్న నేపథ్యంలో నామినేషన్ వేసిన ఒక రోజు ముందు కొత్త బ్యాంక్ ఖాతా తెరవాలని సూచించారు. ఎన్నికల సమయంలో నిర్వహించే సభలు, ర్యాలీలకు తప్పనిసరిగా ఎన్నికల అధికారుల నుండి అనుమతులు తీసుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే తగు చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఈఆర్వో నాగమణి, ఏఆర్వోలు, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ రామ్‌చందర్ తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పక్షాలతో సమావేశమైన ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు


వల్లభాయ్‌పటేల్ నగర్‌లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


ఘటన స్థలంలో మృతుడు సాదిఖ్

దుండిగల్: ఔటర్ రింగ్‌రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. టౌలిచౌకి ప్రాంతానికి చెందిన ఖమర్ అలమ్ కుమారుడు మహ్మద్ సాధిఖ్(27) గల్ఫ్‌లోని ఖతార్‌లో కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. నెల రోజుల క్రితం తిరిగి హైదరాబాద్‌కు వచ్చాడు. కాగా కారులో ఔటర్ రింగ్ రోడ్డుపై పటాన్‌చెరువు నుంచి దుండిగల్ వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం 6 గంటల సమయంలో మల్లంపేట టోల్ గేట్ వద్దకు రాగానే కారులో పెట్రోల్ అయిపోంది. దీంతో పెట్రోల్ తెచ్చుకునేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం అతన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలు కావడంతో సాధిఖ్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న దుండిగల్ పోలీస్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

108 వాహనంలోనే ప్రసవం

సుభాష్‌నగర్: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణీని మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో 108లో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిన ఘటన షాపూర్ నగర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మగ్దుమ్‌నగర్ చెందిన అజమెరి ఖాటూమ్ (25) నిండు గర్భిణీ. బుధవారం ఉదయం ప్రసవం కోసం షాపూర్‌నగర్ లోని యూపీహెచ్ ఆసుపత్రికి వచ్చింది. ఆమెకు పురిటి నొప్పులు తీవ్రతరం కావడంతో మెరుగైన వైద్యం కోసం 108లో గాంధీ ఆసుపత్రికి తరలించారు. గాంధీకి తరలిస్తుండగా ఐపీడీఎల్ వద్ద ఆజమెరి ప్రసవించింది. ఆమెకు పాప పుట్టిందని, తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని ఈఎంటి రాజు, పైలెట్ శ్రీనివాసులు అన్నారు.

బీజేపీ వైపే కుత్బుల్లాపూర్ ప్రజలు

- నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్
- అవకాశం ఇస్తే అభివృద్ధి ఏంటో చూపిస్తా


జీడిమెట్ల డివిజన్ వివిధ కాలనీ ప్రజలతో సమావేశమైన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: కుటుంబ పాలనలో తెలంగాణ రాష్ట్రం దోపిడీకి గురైందని.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబమే బాగుపడిందే తప్ప రాష్ట్ర ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు, కుత్బుల్లాపూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. బుధవారం చింతల్ డివిజన్ వల్లభాయ్‌పటేల్‌నగర్‌లో ఆయన ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... కుత్బుల్లాపూర్ ప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. ఈ దఫా ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. పార్టీ శ్రేణులు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ పార్టీ వైపు మొగ్గు చూపేలా కృషి చేయాలన్నారు.

తెలంగాణాలో బీజేపీ జెండా ఎగరడం ఖాయం...

మేడిగడ్డ బ్యారేజీ శిథిలమైతే నోరు మెదపని కేసీఆర్ ప్రతిపక్ష పార్టీలను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. ఎలాగైనా అధికారంలోకి రావాలని అడ్డదార్లు తొక్కుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు బీఆర్‌ఎస్ అవినీతి పాలనతో విసుగు చెందారని అన్నారు. తెలంగాణాలో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. కుత్బుల్లాపూర్‌లో తొమ్మిదేళ్లుగా అభివృద్ధి కుంటు పడిందన్నారు. తనకు అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తానన్నారు.

◆ బీజేపీకి మద్దతుగా పలు కాలనీల తీర్మానం..

జీడిమెట్ల 132 డివిజన్ శ్రీ వెంకటేశ్వర కాలనీ, రాఘవేంద్ర కాలనీ, ఎంఎస్.రెడ్డి నగర్ కాలనీల్లో పర్యటించిన కూన శ్రీశైలంగౌడ్ కాలనీవాసులతో సమావేశమయ్యారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ఇచ్చిన తనను ఆశీర్వదించాలని శ్రీశైలం గౌడ్ కోరగా భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని కాలనీవాసులు ఏకగ్రీవ తీర్మాన పత్రాలు అందజేశారు.

జగద్గిరిగుట్టలో జోరుగా ప్రచారం

జగద్గిరిగుట్ట డివిజన్‌లో బీజేపీ నాయకుడు జేకే శేఖర్‌యాదవ్, సుధల ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ శ్రీశైలంగౌడ్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు.



బీజేపీలో చేరికలు


బీజేపీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న కూన శ్రీనివాస్‌గౌడ్

జీడిమెట్ల అయోధ్యనగర్‌కు చెందిన యువకులు బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ సాయిరామ్‌రెడ్డి, రామిరెడ్డిల ఆధ్వర్యంలో బీజేపీలో చేరగా సీనియర్ నాయకుడు, కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కుత్బుల్లాపూర్ అభివృద్ధి కూన శ్రీశైలంగౌడ్‌తో సాధ్యమని, ఆయన్ని గెలిపించేందుకు శాయశక్తులా కృషి కేయాలని సూచించారు. క్రాంతి, విష్ణువర్ధన్‌రెడ్డి, లడ్డు, చందు, రాజిరెడ్డి, రాజు, మహేందర్, బబ్లు, దుర్గేష్, ప్రభ, శేఖర్, వంశీ, నీరజ్, వినోద్, షణ్ముఖరావు, యశ్వంత్, వెంకటేష్ తదితరులు బీజేపీలో చేరారు.

నామినేషన్ టైమ్.. గెట్ రెడీ

- రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ షురూ..
- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరణ
- జనరల్ రూ.10 వేలు.. ఎస్సీ, ఎస్టీలకు రూ.5 వేల డిపాజిట్
- ఆర్ఓ ఆఫీసులోకి అభ్యర్థితో పాటు నలుగురి మాత్రమే అవకాశం
- ఆన్‌లైన్ ఇబ్బందులు ఉంటే.. రిటర్నింగ్ అధికారి నుంచి పొందవచ్చు



సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రేటర్ హైదరాబాద్‌తో సహా శివారు రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లోని అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా శుక్రవారం నుంచి ఈనెల 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ప్రారంభం కానుండటంతో.. ఎన్నికల అధికార యంత్రాంగం అంతా సిద్ధం చేసింది. నామినేషన్ల దాఖలు ప్రక్రియలో రాజకీయ పార్టీలతో సహా అభ్యర్థులు పాటించాల్సిన ఎన్నికల ప్రవర్తన, నియమావళిని కూడా వెల్లడించారు. 3వ తేదీ నుంచి 10 వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను శాసనసభ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారులు స్వీకరిస్తారు. నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థితో పాటు మరో నలుగురికి మాత్రమే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి వెళ్లేందుకు అనుమతి ఇస్తారు. వాహనాలను ఆర్ఓ కార్యాలయానికి వంద మీటర్ల దూరంలో ఉంచాల్సి ఉంటుంది. ఎన్నికల కమిషన్ రూపొందించిన సువిధ యాప్ ద్వారా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు 48 గంటల ముందు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ఆన్‌లైన్‌లో ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లయితే నేరుగా సంబంధిత రిటర్నింగ్ అధికారి ద్వారా అనుమతి పొందాల్సి ఉంటుందని ఎన్నికల అధికార యంత్రాంగం పేర్కొంటోంది.

నామినేషన్ పత్రాలు దాఖలు చేసే కేంద్రాలివే..

ఉమేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ పత్రాలను కీసర ఆర్డీఓ కార్యాలయంలో సంబంధిత రిటర్నింగ్ అధికారి స్వీకరిస్తారు. మిగతా 4 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన అభ్యర్థుల నామినేషన్ పత్రాలను జీహెచ్ఎంసీ పరిధిలోని డిప్యూటీ కమిషనర్ కార్యాలయాల్లో ఎన్నికల అధికారులు స్వీకరిస్తారు.

దరావతు(డిపాజిట్) చెల్లింపు

◆ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా జనరల్ స్థానంలో పోటీ చేసే అభ్యర్థి రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ.5 వేలు డిపాజిట్(దరావతు) చెల్లించాలి. ఈ డిపాజిట్ సొమ్మును బ్యాంకు చలనా రూపంలో చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రాన్ని నామినేషన్ పత్రంతో జత చేయాలి. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థి ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా తెరవాలి. ఈ బ్యాంకు ఖాతా ద్వారానే ఎన్నికల ఖర్చుల లావాదేవీలు నిర్వహించాలి. బ్యాంకు ఖాతా వివరాలను నామినేషన్ పత్రంలో తప్పని సరిగా పేర్కొనాలి.

అభ్యర్థిత్వంపై ప్రతిపాదనలిలా..

◆ అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ పత్రాలను దాఖలు చేసే అభ్యర్థిని ప్రతిపాదించే వ్యక్తి సంబంధిత నియోజకవర్గంలో ఓటరై ఉండాలి. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్రస్థాయి పార్టీలకు చెందిన అభ్యర్థిని పోటీ చేస్తున్న అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఒక ఓటరు ప్రతిపాదించాలి. స్వతంత్ర, గుర్తింపు లేని పార్టీల అభ్యర్థులను మాత్రం పది మంది ఓటర్లు ప్రతిపాదించాలి. ప్రతిపాదించే వారు తన ఓటరు జాబితా వివరాలను కూడా సమర్పించాలి. అభ్యర్థి నేరుగా లేదా తనను ప్రతిపాదించే వ్యక్తి నామినేషన్ పత్రాలను దాఖలు చేసేందుకు అవకాశముంటోంది. అసెంబ్లీ నియోజకవర్గ స్థానంలో నామినేషన్ పత్రం దాఖలుకు అభ్యర్థి వయస్సు 25 ఏళ్లు నిండి ఉండాలి. తెలంగాణ రాష్ట్రం పరిధిలోని ఏదైనా అసెంబ్లీ నియోజకవర్గంలో బరిలో నిలిచే అభ్యర్థికి ఖచ్చితంగా ఓటు హక్కును కలిగి ఉండాలి.

నేరచరిత్ర.. ఆస్తుల వివరాలు

అభ్యర్థులు తన నేర చరిత్ర, తనపై నమోదైన పోలీసు కేసులు, ఇతరత్రా కోర్టులో విచారణలో ఉన్న కేసుల వివరాలతో సహా తనతోపాటు, భార్య, పిల్లల స్థిర, చరాస్తులు, అప్పులు, బ్యాంకులో డిపాజిట్లు, నగ దు నిల్వ వివరాలు వెల్లడిస్తూ.. అఫిడవిట్ (ప్రమాణ పత్రం) సమర్పించాలని ఎన్నికల అధికార యంత్రాంగం పేర్కొంటోంది.

అభ్యర్థి 10 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను నామినేషన్ పత్రంతో జతపరచాలి. నామినేషన్ పత్రాలు దాఖలు సమయంలో రిటర్నింగ్ అధికారి ఎదుట అభ్యర్థి ప్రతిజ్ఞ చేయాలి. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్రస్థాయి పార్టీల అభ్యర్థులు తమ నామినేషన్ పత్రంతో పాటు పార్టీ జారీ చేసిన ఏ–ఫాం, బీ–ఫాం పత్రాలను సమర్పించాలి.